విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

శనివారం 18 జనవరి 2025 8 పేజీలు

కోటిపల్లి-నరసాపురం

రైల్వేలైన్ సాధిస్తాం

- కోనసీమ అభివృద్ధికి సమన్వయంతో పని చేస్తాం
- సంక్రాంతి సంబరాల ముగింపు సభలో మంత్రి సుభాష్, ఎంపీ హరీష్ మాధుర్

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వాసుల చిరకాల వాంఛ కోటిపల్లి-నరసాపురం రైల్వే లైన్‌ను సమన్వయంతో సాధించి తీరుతామని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్‌లు వెల్లడించారు. రామచంద్ర పురం వివిఎస్‌ఎం కళాశాల ప్రాంగణంలో మూడు రోజులపాటు మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంక్రాంతి ఉత్సవ్ 2025 సంబరాలు ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొని ఇరువురు మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ మూడు రోజులపాటు ఏర్పాటు చేసిన సంక్రాంతి ఉత్సవ్ మెగా సంబరాల్లో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని సంబరాలు చేసుకున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సంపూర్ణ సహకారంతో త్వరలో కోనసీమలో రైలు కూత వినిపిస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందన్నారు. గడచిన ఆరు మాసాల్లో సుమారు రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని, రానున్న సంవత్సరన్నర కాలంలో ఐదు లక్షల ఉద్యోగాల కల్పన ధ్యేయంగా కృషి జరుగుతుందన్నారు. అమలాపురం ఎంపీ హరీష్ మాధుర్ మాట్లాడుతూ తన తండ్రి కీ.శే. బాలయోగి ఆశయాలు, ▶మిగతా 2లో..

ఏటా 15 శాతం వృద్ధే లక్ష్యం

- ఉద్యాన, ఆక్వా, పాడిపరిశ్రమ అభివృద్ధిపై దృష్టిసారించాలి
- స్వర్ణాంధ్ర@ 2047 ప్రణాళికలో భాగంగా ఐదేళ్లలో నిర్దేశించిన లక్ష్యసాధన దిశగా అడుగులు
- కలెక్టర్ కె. వెట్రిసెల్వి

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో ఉద్యాన పంటలు విస్తరణ, ఆక్వారంగం, పాడిపరిశ్రమ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో నిర్దేశించిన లక్ష్యాలు, స్వర్ణాంధ్ర@ 2047లో భాగంగా రానున్న ఐదేళ్లలో సాధించే లక్ష్యాల అమలు, ప్రగతిపై నిర్దేశించిన కీ ఫెర్మార్మెన్స్ ఇండికేటర్స్‌పై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో పండే ప్రధాన పంటలు, వాటి ఆధారంగా పరిశ్రమల అభివృద్ధి,సాగునీటి వసతి కల్పన,విస్తారంగా ఉన్న భూములకు డ్రిప్ ఇరిగేషన్ వంటివి కల్పించాల న్నారు. ఉద్యాన పంటల విస్తరణ, ఆక్వారంగం, పాడిపరిశ్రమ అభివృద్ధిపై దృష్టిసారించాలన్నారు. అన్నిరంగాల్లో జిల్లా సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా స్వర్ణాంధ్ర@ 2047 విజన్ ప్రణాళికలో భాగంగా ఐదేళ్ల కాలంలో అభివృద్ధి లక్ష్యాలతో నిర్ధేశించుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు.ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇక రెండు నెలలు మాత్రమే ఉన్నందున అందుకు సంబంధించిన లక్ష్యాలను త్వరితగతిన సాధించాలన్నారు.కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో పేర్కొన్న కీ ఫెర్మార్మెన్స్ ఇండికేటర్స్ సంబంధించి నాటినుంచి నేటి వరకు క్షేత్రస్థాయిలో సాధించిన ప్రగతి తీరును కలెక్టర్ ఈ సందర్భంగా సమీక్షించారు. ఆయా లక్ష్యసాధనకు క్షేత్రస్థాయిలో ఏ విధమైన చర్యలు తీసుకున్నదీ అధికారులతో సమీక్షించారు. మార్చి నెలాఖరు నాటికి నూరు శాతం ఈఏడాది లక్ష్యాలను సాధించాలని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా ఉధ్యాన శాఖ అధికారి ఎస్.రామ్మోహన్,జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్ కె. హబీబ్ భాషా, ఏపిఎంఐపి పిడి పివిఎస్ రవికుమార్, జిల్లా మత్స్యశాఖ అధికారి కె.ఎస్.వి.నాగలింగాచార్యులు,పశు సంవర్ధక శాఖ ఇన్‌చార్జి జెడి టి.గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి

విశాలాంధ్ర -భీమవరం: రీ సర్వేపై రెవెన్యూ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం భీమవరం రెవెన్యూ డివిజన్ పరిధిలో తహసిల్దార్లు, మండల సర్వేలు, డీటీలు వీఆర్వోలుకు భీమవరం ఎస్.ఆర్.కె.ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో నాలుగో దశ రీ సర్వే పనులు ప్రారంభం పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సులో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే పై రెవిన్యూ అధికారులు తప్పక పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. రికార్డులు పారదర్శకంగా నిర్వహించాలని చెప్పారు. రీ సర్వేపై విపులంగా పలు సూచనలు, సలహాలను తెలిపారు. విలేజి బౌండరీ ఖచ్చితంగా పాటించా లన్నారు. ప్రభుత్వ భూములు సంబంధించి శాఖల వారీగా ఇరిగేషన్, డ్రైనేజీ, దేవస్థానం జిల్లా పరిషత్ భూములకు సంబంధించి ముందుగా నోటీసులు ఇచ్చి సర్వే నిర్వహించాలన్నారు. రైతు వారి భూములకు సంబంధించినవి ముందుగా నోటీసులు ఇచ్చి రైతులు యొక్క ఆధ్వర్యంలో సర్వేలు చేయాలని సంబంధిత శాఖల అధికారులకు జిల్లా జాయింట్ ▶మిగతా 2లో..

ప్రమాద రహిత సమాజ నిర్మాణానికి కృషి

ప్రారంభమైన ఆర్టీసీ రోడ్డు భద్రత మాసోత్సవాలు

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : ప్రమాద రహిత నవ సమాజ నిర్మాణానికి డ్రైవర్లు కృషి చేయాలని తూర్పుగోదావరి జిల్లా అడిషనల్ ఎస్పీ (శాంతి భద్రత) అల్లూరి వెంకట సుబ్బరాజు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ) ఆధ్వర్యంలో జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షబానా అధ్యక్షతన ఆర్టీసీ డిపోలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభిం చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అడిషనల్ ఎస్పీ(శాంతి భద్రత)అల్లూరి వెంకట సుబ్బరాజు మాట్లాడుతూ ప్రమాద రహిత సమాజంగా రూపుదిద్దేందుకు డ్రైవర్లంతా సహకరించాలన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన ట్రాఫిక్ డిఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించకుండా డ్రైవర్లు ప్రతిఒక్కరు బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న తూర్పు గోదావరి జిల్లా ప్రజా రవాణా అధికారి(ఆర్ ఎం) షర్మిల అశోక మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల వల్ల కలిగే ప్రాణనష్టాన్ని తగ్గించడమే లక్ష్యంగా తమ సంస్థ ఆధ్వర్యంలో ▶మిగతా 2లో..

పాత కక్షలతో మాజీ సర్పంచ్ హత్య

విశాలాంధ్ర - కలిదిండి: పాత కక్షలతో మాజీ సర్పంచి కాల్వ నల్లయ్య హత్యకు గురైనట్లు ఎస్సై వి. వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సంతోషపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచి, మాజీ ఎంపీటీసీ కాల్వ నల్లయ్య (55) కలిదిండిలో నివాసం ఉంటూ సంతోషపురం గ్రామంలో చెరువులు చూసుకుని గురువారం సాయంత్రం మోటార్ సైకిల్ పై కలిదిండి వస్తుండగా సంతోషపురం, భోగేశ్వరం రోడ్డు లో సంతోషపురం గ్రామానికి చెందిన బోధనపు శ్రీను మోటార్ సైకిల్ తో ఢీ కొట్టి ఐరన్ రాడ్‌తో తలపై కొట్టడంతో రక్త గాయాలై క్రింద పడిపోయాడు. శ్రీను అక్కడి నుంచి పరారు కాగా దారిన వెళ్లేవారు నల్లయ్య కుమారుడికి సమాచారం అందించగా ▶మిగతా 2లో..

బరుల పేరిట ఎమ్మెల్యే కలెక్షన్ రూ.10 కోట్లు

- పవన్‌కు చిత్తశుద్ధి ఉంటే ఎమ్మెల్యేను సస్పెండ్ చేయాలి
- ఏరులై పారిన మద్యం
- రికార్డు స్థాయి అమ్మకాలు
- పేపరు మిల్లు కార్మికులకు తీరని అన్యాయం చేసిన ప్రవీణ్ చౌదరి
- మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తీవ్ర విమర్శ

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా కోడి పందాలు పేరుతో ఎన్డీఏ కూటమి నాయకులు పేట్రేగిపోయారని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షులు జక్కంపూడి రాజా అన్నారు. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో శుక్రవారం జరిగిన విలేఖర్ల సమావేశంలో జక్కంపూడి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో దాదాపు 2వేల బరులు ఏర్పాటు చేసి కోడిపందేలు,పేకాట, గుండాట వంటి జూదాలు ఆడిస్తే, అందులో 400వరకు బడులనే కేంద్రంగా ▶మిగతా 2లో..

పంటబోదెలో గుర్తు తెలియని మృతదేహం

విశాలాంధ్ర- పాలకోడేరు : పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామంలో పంట బోదెలో మృతదేహాన్ని గుర్తించి స్థానికులు గ్రామ వీఆర్వో-2 గునుపూడి దేవదాసుకు సమాచారం అందించారు. స్థానికుల సహాయంతో మృతదేహాన్ని పరిశీలించగా సుమారు 50-55 సంవత్సరాల వయసు గల పురుషుడి మృతదేహంగా గుర్తించి వెంటనే పాలకోడేరు పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయగా పోలీసువారి సమక్షంలో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహం గుర్తుపట్టలేనంతగా ఉంది. పాలకోడేరు ఎస్ఐ మంతెన రవివర్మ కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అధికారులూ... ఆదుకోండి

విశాలాంధ్ర- పాలకోడేరు : పాలకోడేరు మండలం పెన్నాడ పాలెం గ్రామానికి చెందిన బుర్ర సూరిబాబు (49) సుమారుగా ఆరు సంవత్సరాల నుంచి దీర్ఘకాలిక వ్యాధితో మంచానికి పరిమితమై ఉన్నాడు. తనకు వచ్చే పెన్షన్ 4వేల రూపాయలు మందులకు కూడా సరిపోవడంలేదని వాపోతున్నాడు. మంచం పైనే పరిమితమైన రోగులకు ప్రభుత్వం ఇచ్చే పెన్షన్‌ను తనకు వర్తింప చేసి, తనని, తన కుటుంబాన్ని ఆదుకోవాలని అధికారులను ప్రజా ప్రతినిధులను వేడుకుంటున్నాడు.

కొప్పుల వెలమ సంఘం నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - పెంటపాడు : కొప్పుల వెలమ సంఘం 2025 నూతన క్యాలెండర్‌ను వెలమ సంఘం రాష్ట్ర నాయకులు కునిరెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కిలపర్తి వెంకట్రావు (తెదేపా పెంటపాడు మండల అధ్యక్షులు),దాసరి అప్పన్న (బీసీ సెల్ ఏపీ రాష్ట్ర కార్యదర్శి),బండారు వెంకట్రావు (డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్.. పెంటపాడు మండలం), కసిరెడ్డి మధులత (ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన వీర మహిళా అధ్యక్షురాలు, పెంటపాడు వెలమ యువజన సంఘం భవనంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిరవరపు వెంకట్రావు, నక్క అబ్బి, ఏవీఎస్, బండారు కరుణాకర్, కర్రి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పరీక్షాపే చర్చలో నిడమర్రు విద్యార్థి

విశాలాంధ్ర - నిడమర్రు: కేంద్ర విద్యా శాఖ ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో నిర్వహించిన జాతీయ పరీక్షాపే చర్చ కార్యక్రమంలో దేశంలోని 28 రాష్ట్రాలు, ఏడు కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఎనిమిది మంది విద్యార్థులు, గైడ్ టీచర్స్ ఈ సదస్సునకు హాజరయ్యారు. ఇందులో భాగంగా నిడమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎంపికైందని హెచ్ఎం రాజేశ్వరి శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అంశం శారీరక,మానసిక అభివృద్ధికి ఆహారం పాత్ర అనే అంశంపై చర్చా గోష్టిని నిర్వహించారు. దేశవ్యాప్తంగా నిర్వహించే అన్ని రకాల పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేశారని తెలిపారు. ఈ సదస్సుకు హాజరు కావడానికి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఢిల్లీకి వెళ్లడానికి విమాన సౌకర్యం కల్పించాలని, విద్యార్థులలో జాతీయ సమైక్యతను పెంపొందించడానికి భిన్నత్వంలో ఏకత్వం అనే భావనను అందరికీ తెలియజేసేందుకు విద్యార్థులు తమ అభిప్రాయాలను ఒకరినొకరు పంచుకోవడానికి ఇది ఒక వేదికగా పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం ముగించుకుని సురక్షితంగా నిడమర్రు హైస్కూల్‌కు చేరుకున్నారని ఆమె తెలిపారు.

బరుల పేరిట రూ. 10 కోట్లు

(1వ పేజీ తరువాయి)

చేసుకుని జూదాలు నడిపారని ధ్వజమెత్తారు. మద్యం ఏరులైపారిందని,చరిత్రలో ఎన్నడూలేని విధంగా 400కోట్ల రూపాయలు ఈ సంక్రాంతికి మద్యం అమ్మకాలు సాగినట్లు ఒక తెలుగు దినపత్రికలో కథనాలు వచ్చాయని వాపోయారు. ప్రస్తుతం ఏ ఒక్క దుకాణాల్లో కూడా గిరాకీ లేకుండా పోయిందన్నారు. పైగా సంక్రాంతి పండగకు గతంలో ఎన్నడూ లేని రీతిలో రాష్ట్రంలోని అన్ని నియోజక వర్గాల్లో కోడిపందేలు, పేకాట, గుండాట, వంటి జూద శిబిరాలు ఏర్పాటుచేసి కూటమి నాయకులు ప్రజల దగ్గర నుంచి డబ్బులు దోచేశారని దుయ్యబట్టారు. గుండాటలో డబ్బులు పోగొట్టుకుని ఒక యువకుడు ఆత్మహత్యకు పాల్పడితే, కోడిపందేల్లో డబ్బులు ఇవ్వలేదని మరో యువకుడు పీక కోసుకున్నాడని సాక్షాధారాలతో ప్రస్తావిస్తూ,ఇదేనా కూటమి పాలన అని నిలదీశారు.

బరుల దగ్గర పోలీసులను పక్కకు గెంటేయడం, తోసెయ్యడం వంటివి చూస్తుంటే,అసలు రాష్ట్రంలో న్యాయవ్యవస్థ ఉందా అంటూ నిలదీశారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పే దానికి చేసే దానికి పొంతన ఉండదని మరో సారి రుజువైందన్నారు. సూపర్ సిక్స్ పథకాల పేరిట ప్రజలను వంచించారని ఎద్దేవా చేశారు.జగన్ ప్రభుత్వంలో అందించిన సంక్షేమ పథకాలు వివరించారు.

రాజమహేంద్రవరం లోని పేపరుమిల్లు కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేసారు. గతంలో చేసిన వేతన ఒప్పందం కంటే తక్కువ చేస్తామనడం సమంజసం కాదన్నారు. ప్రవీణ్ చౌదరి వ్యవహార ధోరణితో కార్మికులకు తీరని అన్యాయం జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పవన్‌కు చిత్తశుద్ధి ఉంటే సస్పెండ్ చెయ్యాలి

రాజానగరం నియోజకవర్గంలో ఇసుక, మద్యం దందాలు పెరిగిపోయాయని,ఇక సంక్రాంతికి అన్నిచోట్లా బరులు ఏర్పాటుచేసి ఒక్కొక్కటి రూ. 10లక్షల నుంచి కోటి రూపాయల వరకు వేలం పెట్టి మరీ వసూలు చేయడం ద్వారా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ రూ.10కోట్లు దండుకున్నారని జక్కంపూడి రాజా విమర్శించారు.

రాజానగరం ప్రాంతంలో ఎప్పుడు లేని విధంగా డ్రగ్స్, రేవ్ పార్టీలు, జూదాలు జరిగాయని అనకాపల్లిలో పట్టుకున్న గంజాయి మూలాలు కాపవరంలో జనసేన నాయకుడు దగ్గర మూలాలు ఉన్నాయని వాపోయారు. వీఆర్వో పోస్టు మొదలుకుని సిఐ పోస్టు వరకు డబ్బులు వసూలు చేయడం వలన అన్ని ఆఫీసుల్లో పనికి ఇంత అనేరీతిలో నడుస్తోందని ఆయన విమర్శించారు.

పెనమలూరులో బరుల దగ్గర జనసేన జెండాలు ప్రదర్శించారన్న సాకుతో ఒకర్ని పార్టీ నుంచి సస్పెండ్ చేసారని, పవన్ కళ్యాణ్ కి నిజంగా చిత్తశుద్ధి ఉంటే ముందుగా రాజానగరం ఎమ్మెల్యేను సస్పెండ్ చేయాలని, కూటమి నుంచి బయటకు రావాలని డిమాండ్ చేసారు.

హత్య

(1వ పేజీ తరువాయి)

వెంటనే ఆంజనేయులు కారులో కలిదిండి ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకువచ్చి ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం భీమవరం ప్రైవేటు హాస్పిటల్‌కు తీసుకువెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రూరల్ సీఐ రవికుమార్, మండవల్లి ఎస్ఐ రామచంద్ర రావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

ఏలూరు నుంచి క్లూస్‌టీం వచ్చి వివరాలు సేకరించారు. నల్లయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని భీమవరంలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేస్తా రని తెలిపారు.

నిర్మాణానికి కృషి

(1వ పేజీ తరువాయి)

రోడ్డు ప్రమాదాలు పై ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించేందుకు నెల రోజుల పాటు వివిధ కార్యక్రమాలు చేపట్టామన్నారు.

సభాధ్యక్షులు,డిపో మేనేజర్ షేక్ షబానా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ఈ నెల 16 నుండి ఫిబ్రవరి 15వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు శ్రీకారం చుట్టనున్నారు.దీనిలో భాగంగా డ్రైవర్లకు శిక్షణ తరగతులు, వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

తొలుత ఆర్టీసీ డ్రైవర్లకు, ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత పై అతిథులు అవగాహన కల్పించడంతో పాటు పలు సూచనలు, సలహాలు అందించారు.అనంతరం ట్రాఫిక్ పోలీసులు,ఆర్టీసీ సిబ్బంది, ఆటో డ్రైవర్లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం డిపో అసిస్టెంట్ మేనేజర్ అజయ్ బాబు,వివిధ శాఖల అధికారులు, ఆర్టీసీ సిబ్బంది, ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రీ సర్వే (1వ పేజీ తరువాయి)

కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

సమావేశంలో ఆర్డిఓ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఇంచార్జ్ జిల్లా సర్వే అధికారి కె.శ్రీనివాస్, డివిజన్ సర్వే అధికారులు మల్లికార్జునరావు, రాంబాబు, భీమవరం రెవిన్యూ డివిజన్ తహసిల్దార్లు, మండల సర్వేలు, డీటీలు, వీఆర్వోలు, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

సాధిస్తాం (1వ పేజీ తరువాయి)

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చుతామన్నారు. త్వరలో కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్ సాధన, కోటిపల్లి-అయినవిల్లి రోడ్ కం బ్రిడ్జిను తీసుకొచ్చేందుకు కృషి జరుగుతుందన్నారు. ఇప్పటికే కేంద్రంతో మాట్లాడి తగిన నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ తనదైన శైలిలో పనిచేస్తూ అభివృద్ధిలో రాజీలేని కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి శుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యమైన బీజేపీకి ప్రాధాన్యత ఇవ్వాలి

విశాలాంధ్ర-లింగపాలెం: కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉన్న బిజెపికి తగిన సహకారం ఇవ్వాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు విక్రమ్ కిషోర్, రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు చక్రధరరావు, జిల్లా ఇన్చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్‌కు విజ్ఞప్తి చేశారు. మంత్రి ఏలూరు పర్యటనకు వచ్చిన సందర్భంగా ఈ నాయకులు ఈయనతో కలిసి పలు విషయాలు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. సాగునీటి సంఘ ఎన్నికల్లో బిజెపితో ఎటువంటి సంప్రదింపులు జరపలేదని వీరు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. సహకార సంఘాలకు ఇచ్చే నామినేటెడ్ పదవుల్లో బిజెపికి ప్రాధాన్యత ఇవ్వాలని వీరు కోరారు. ఏలూరు జిల్లాలో బిజెపికి పట్టు ఉన్న నియోజకవర్గాలలో తమ పార్టీ వారిని నామినేటెడ్ పదవులకు ఎంపిక చేయాలని వీరు ఇన్చార్జి మంత్రిని కోరారు. చింతలపూడి నియోజకవర్గంలో జగనన్న కాలనీలకు కొనుగోలు చేసిన భూముల వ్యవహారంలో అవకతవకలు జరిగాయని, వీటిపై సమగ్ర దర్యాప్తు చేయించి అర్హులకు న్యాయం చేయాలని వీరు కోరారు. చౌకడిపోల డీలర్లభర్తీ వ్యవహారంలో రిజర్వేషన్ పద్ధతిని ప్రవేశపెట్టటం సమంజసంగా లేదని ఈ విధానాన్ని మార్చాలని వీరు ఇంచార్జ్ మంత్రిని కోరారు. గతంలో ఎవరైతే డీలర్లుగా పనిచేసి తప్పుకోవడం జరిగిందో ఆ వర్గానికి చెందిన వారికే వీటిని కేటాయించాలని మంత్రికి తెలిపారు. రిజర్వేషన్ విధానం ఉండటం వల్ల ఎక్కువ మంది జనాభా ఉన్న సామాజిక వర్గాల స్థానంలో తక్కువ జనాభా ఉన్న సామాజిక వర్గానికి రిజర్వేషన్ కల్పించారని వీరు మంత్రికి వివరించారు. బిజెపి నాయకులు విజ్ఞప్తి చేసిన అభిప్రాయాలపై మంత్రి స్పందించి తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని బిజెపి నాయకులు తెలిపారు. కొద్ది రోజులలో జిల్లాలో పర్యటిస్తానని ఆ సమయంలో బిజెపి నాయకులతో జిల్లా వ్యవహారాలపై పూర్తిస్థాయిలో చర్చించేందుకు హామీ ఇచ్చారని బిజెపి నాయకులు విలేకరులకు తెలిపారు.

పన్ను మినహాయింపు వినియోగించుకోండి

విశాలాంధ్ర- భీమవరం టౌన్ : ఎలక్ట్రిక్ వాహనాల వినియోగదారులు పన్ను మినహాయింపును వినియోగించు కోవాలని జిల్లా రవాణా అధికారి ఉమామహేశ్వర ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కాలుష్యం అంతకంతకూ తీవ్రంగా మారుతున్న పరిస్థితుల్లో, వాయు కాలుష్య నియంత్రణ చర్యలను పటిష్టంగా అమలు చేయాలన్న దృక్పథంతో, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం విద్యుత్ వాహనముల ద్వారా కాలుష్యం తగ్గించవచ్చునని తలంచి విద్యుత్ బైకులు, కార్లకు జీవిత పన్ను మినహాయింపును ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో కొనుగోలు చేసిన, రిజిస్టర్ చేసుకున్న అన్ని స్వచ్ఛమైన ఎలక్ట్రిక్ వాహనాలపై పన్నును మినహాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో వాహన వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఉమామహేశ్వరరావు కోరారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : పట్టణంలోని 30, 28,15 వార్డులలో రూ.ఒక కోటి 35 లక్షల రూపాయల అంచనా వ్యయంతో సి.సి. రోడ్లకు ప్రభుత్వ విప్, శాసన సభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం జవాబుదారీ తనంతో పని చేస్తోందని అన్నారు. అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలన్నారు. ప్రజలు పనులను పరిశీలించి అవక తవకలు ఉంటే ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పెంట రాజేశ్వరి, జనసేన పట్టణ అధ్యక్షులు వర్తనపల్లి కాశి, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి వలవల బాబ్జి, బీజేపీ నాయకులు నరిసే సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీలో ప్రయాణం శుభప్రదం

ఎన్.వి.ఆర్ వరప్రసాద్

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు శుభప్రదంగా ప్రయాణించవచ్చని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్వీఆర్ వరప్రసాద్ అన్నారు. గురువారం రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా భీమవరం డిపోలో రోడ్డు భద్రతా మాసోత్సవాల ప్రారంభ కార్యక్రమం డిపో మేనేజర్ పి.ఎన్.వి.ఎం.సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ,ప్రయాణం అంటే ప్రమాదాలు జరగవు అనే ప్రయాణికుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా డ్రైవర్లు నిర్లక్ష్యాన్ని ప్రక్కన పెట్టి రోడ్డు భద్రతా సూత్రులు పాటించాలని అన్నారు. జిల్లా రోడ్డు రవాణా అధికారి ఉమామహేశ్వర మాట్లాడుతూ, డ్రైవర్ డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్, మద్యపానం, అతివేగం ఈ మూడింట ప్రతీ డ్రైవర్ దూరంగా ఉండటం మంచిది అన్నారు, ఈ రోజున సీనియర్ సిటిజన్స్ ప్రయాణం చేయడానికి ఆర్టీసీ బస్సులనే ఎంపిక చేసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో భీమవరం వన్ టౌన్ సిఐ నాగరాజు, జనవిజ్ఞాన వేదిక కన్వీనర్ రంగ సాయి, తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రత అందరి బాధ్యత

విశాలాంధ్ర -నూజివీడు : నూజివీడు పట్టణంలోని ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయంలో శుక్రవారం జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహించారు. తిరివీధి లక్ష్మీ రామారావు చారిటబుల్ సేవా ట్రస్ట్,స్వచ్ఛంద కార్యకర్తలు,ఆర్టీసీ కార్మికులు,ఆటో డ్రైవర్ల సహకారంతో రహదారి భద్రతా మాసోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సంద ర్భంగా ప్రాంతీయ రవాణా శాఖ అధికారి జి. నాగ మురళి, ఆర్టీసీ డిపో మేనేజర్ పవన్ కుమార్ మాట్లాడుతూ వాహన చోదకులు నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. మైనారిటీ తీరని వారికి వాహనాలను ఇవ్వడం నేరమన్నారు. మైనారిటీ తీరకుండా వాహనా లను నడిపితే జరిగే రోడ్డు ప్రమాదాలలో ఇరువైపులా వ్యక్తులు తీవ్ర నష్టాల బారిన పడుతున్నట్లు వివరించారు. ఇలాంటి సంఘటనల్లో వాహన యజమానులు, వాహనం నడిపిన బాలల తల్లిదండ్రులకు భారీ జరిమానాలతో పాటు శిక్షలు పడే అవకాశాలు ఉన్నాయన్నారు. మితిమీరిన వేగంతో వాహనాలను నడిపితే ఊహించని ప్రమాదాలు సంభవిస్తాయన్నారు. మద్యం సేవించి వాహనాలను నడిపే సమయంలో రోడ్డుపై ప్రాణాలు కోల్పోయిన అనేక సంఘటనలు వివరించారు.

ఈ పంట నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : వ్యవసాయ పంట పండించే ప్రతి రైతు ఈ పంట నమోదు చేసుకోవాలని, వ్యవసాయ శాఖ అధికారి చెన్నకేశవులు పేర్కొన్నారు. మండ లంలో పొంగుటూరు గ్రామంలో శుక్రవారం పొలం పిలుస్తుంది కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నకేశవులు మొక్కజొన్న పంట పొలాలను పరిశీలిం చారు. అనంతరం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు పండించే పంటలకు వ్యవసాయ శాఖ అధికారులు సూచనల మేరకు పురుగుమందులను తగు మోతాదులో పిచికారి చేయాలని, రైతులు పొగాకు పంటకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలైన వరి, మొక్కజొన్న, పంటలను పండించాలని ఆయన సూచిం చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది , రైతులు పాల్గొన్నారు.

బ్యానర్లు తొలగించాలి

విశాలాంధ్ర -భీమవరం: పట్టణ పరిధిలోని బహిరంగ ప్రదేశాల్లో ఎలెక్ట్రికల్ పోల్స్, టెలిఫోన్ పోల్స్, డివైడర్లు, ప్రభుత్వ ప్రహరీ గోడలు, రైల్ ఓవర్ బ్రిడ్జి తదితర ప్రాంతాల్లో ఎటువంటి పోస్టర్స్, బేనర్లు, సైన్ బోర్డ్స్ అతికించుట/ఏర్పాటు చేయుట నిషేధించడమైనదని మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాటన్నింటినీ ఈ నెల 19వ తేదీలోపు తొలగించాలని లేనిపక్షంలో రూ.2.00 లక్షలు వరకు అపరాధ వసూలు చేయడమే కాక సంబంధితులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మున్సిపాలిటీల అభివృద్ధికి

నిధుల మంజూరుకు కృషి

ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వెల్లడి

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు: మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవసరమైన నిధుల మంజూరుకు తన వంతు కృషి చేస్తానని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ఏలూరు క్యాంపు కార్యాలయంలో చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌తో కలిసి చింతలపూడి, జంగారెడ్డి గూడెం మున్సిపల్ కమిషనర్లతో ఎంపీ మహేష్ కుమార్ శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. చింతలపూడి, జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఎంపీ మహేష్ కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. రూ. 12 కోట్ల ఆదాయం కలిగిన జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీని గ్రేడ్ -2 నుంచి గ్రేడ్ - 1 చేయాలని పంపిన నివేదిక ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉందని కమిషనర్ కె.వి రమణ ఎంపీ మహేష్ కుమార్ కు వివరించారు. అనంతరం ఎంపీ మహేష్ కుమార్ మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే రోషన్ కుమార్ తో కలిసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సాధ్యమైనంత ఎక్కువ నిధులు రాబట్టేం దుకు కృషి చేస్తున్నట్లు ఎంపీ పేర్కొన్నారు. జంగారెడ్డిగూడెం మున్సిపాలి టీలో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ నిర్మాణానికి రూ. 80 కోట్లతో, సెంట్రల్ లైటింగ్, పార్కుల అభివృద్ధి, ఇతరత్రా పనులు చేపట్టేందుకు రూ.50 కోట్లు, చింతలపూడి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు రూ.42 కోట్లు, కొయ్యలగూడెం నగర పంచాయతీలో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఎంపీ మహేష్ కుమార్ తెలిపారు.రానున్న బడ్జెట్లో నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరినట్లు ఎంపీ స్పష్టం చేశారు.

రైతు నేత రాఘవరెడ్డి మృతి

పలు పర్యాయాలు రాష్ట్ర ఉత్తమ రైతు అవార్డు

విశాలాంధ్ర - పెంటపాడు : పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు మండలం ముదునూరు సహకార సంఘం మాజీ అధ్యక్షులు, రాష్ట్ర రైతు కార్యచరణ సమితి ఉపాధ్యక్షులు,సర్ ఆర్థర్ కాటన్ రైతు క్లబ్ అధ్యక్షులు, రాష్ట్ర ఉత్తమ రైతు అవార్డు గ్రహీత నల్లమిల్లి వీర రాఘవరెడ్డి (76) శుక్రవారం వేకువ జామున మృతి చెందారు. రాఘవరెడ్డికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమారుడు గని రెడ్డి, రెండవ కుమారుడు విజయానంద రెడ్డి (అంజిరెడ్డి). అంజిరెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగపు జిల్లా నాయకులు. రాఘవ రెడ్డి పెంటపాడు రాజకీయాలలో ప్రముఖ పాత్ర పోషిస్తూ వచ్చారు. రాష్ట్ర రైతు కార్యచరణ సమితి ఉపాధ్యక్షులుగా రైతు ఉద్యమాల్లో ఎంతో చురుగ్గా పాల్గొన్నారు. వ్యవసాయ రంగంలో ఆయన చేసిన కృషికి గాను రెండు పర్యాయాలు రాష్ట్ర ఉత్తమ రైతు అవార్డును అందుకున్నారు. ప్రతి ఏట సర్ ఆర్థర్ కాటన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేవారు. కాటన్ పేరు మీద పలు సేవా కార్యక్రమాలు చేయడమే కాకుండా, విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించి వారికి అవార్డులను అందజేసే వారు. మండల స్థాయిలో ఆదర్శ రైతులను గుర్తించి వారికి సన్మాన సత్కారాలను నిర్వహించేవారని సీపీఐ మండల కార్యదర్శి కళింగ లక్ష్మణరావు తెలిపారు.

పెంటపాడులో అంత్యక్రియలు

రాష్ట్ర ఉత్తమ రైతు అవార్డు గ్రహీత నల్లిమిల్లి వీర రాఘవరెడ్డి అంత్యక్రియలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పెంటపాడు రెడ్డి స్మశాన వాటికలో ఆయన భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగపు అధ్యక్షులు వడ్డీ రఘురాం నాయుడు, తాడేపల్లిగూడెం జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, తాడేపల్లిగూడెం వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మురళీకృష్ణ, పడమర సొసైటీ మాజీ అధ్యక్షులు పసల అచ్యుత సత్యనారాయణ మూర్తి, తెలుగు మహిళ జిల్లా నాయకురాలు కొండ్రెడ్డి హైమావతి, స్థానిక ఎంపిటిసి రెడ్డి సూరిబాబు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు పెద్ద ఎత్తున అంత్యక్రియలలో పాల్గొన్నారు.

ప్రతి మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్

రానున్న నూరు రోజుల్లో అత్యంత పరిశుభ్ర జిల్లాగా ఏలూరు జిల్లాను తీర్చిదిద్దడమే లక్ష్యం : కలెక్టర్

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు: స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ కింద రానున్న వందరోజుల్లో అత్యంత పరిశుభ్ర జిల్లాగా ఏలూరు జిల్లాను తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. శు క్రవారం స్థానిక కలెక్టరేట్‌లో "స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్" కార్యక్రమం నిర్వహణపై సంబంధిత అధికారులకు కలెక్టర్ వెట్రిసెల్వి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఈ కార్యక్రమం పటిష్టవంతంగా అమలుచేసేందుకు ఆయా శాఖల వారీగా నోడల్ అధికారులను నియమించాలన్నారు. ఏలూరు నగరంలో శనివారం పాత బస్టాండు ప్రాంతంలో స్వచ్ఛ ఆంధ్రా-స్వచ్ఛ దివాస్ కార్యక్రమ నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనరును కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా శ్రమదానం, మానవహారం, ప్రతిజ్ఞ, ఆయా ప్రాంతాల్లోని పరిసరాలను పరిశుభ్రం చేయడం వంటి కార్యక్రమాలు పెద్దఎత్తున చేపట్టాలన్నారు. ఈ సమయంలో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో స్థానికులను, కళాశాల విద్యార్థులను, వాకర్స్ అసోసియేషన్లను, స్వచ్ఛంద సంస్థలను, ప్రజాప్రతినిధులను పెద్దఎత్తున భాగస్వామ్యం చేయాలన్నారు. ప్లాస్టిక్ వినియోగ నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలోని హోకర్స్, ఇతర ఆహార పదార్థాల విక్రయాలకు సంబంధించిన షాపులను హెల్త్ ఇన్‌స్పెక్టర్లతో గుర్తించి వాటిలో ఆహార పదార్థాలు హ్యాండ్లింగ్ పరిశుభ్రత పాటించడం వంటి అంశాలను పరిగణలోకి తీసుకొని ఆయా షాపులకు ఒకటి నుంచి పది వరకు ర్యాంకులను ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పి సిఇఓ కె. సుబ్బారావు, నగరపాలక కమిషనరు ఎ. భానుప్రతాప్, డిపిఓ కె.అనురాధ, డిఇఓ వెంకటలక్ష్మమ్మ, ఇన్ చార్జి ఉపరవాణా కమిషనరు కెఎస్ఎంవి కృష్ణారావు,ఆర్ టిసి పిఆర్వో నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

క్యాబినెట్ నిర్ణయంపై హర్షం

విశాలాంధ్ర- పెంటపాడు : సీఎం చంద్రబాబు అధ్యక్షతన శు క్రవారం జరిగిన ఏపీ కేబినెట్ సమావేశంలో పేదలకు స్థలాలు ఇవ్వడానికి మంత్రిమండలి ఆమోదం తెలపడం, సీఎం చంద్రబాబు ఆయా జిల్లాల ఇన్చార్జ్ మంత్రులకు జిల్లాలలో సమావేశాలు ఏర్పాటు చేసి, స్థలాల సేకరణపై నిర్ణయాలు తీసుకోవాలని, ఇళ్ల స్థలాలకు పట్టణాల్లో స్థలం లేకపోతే టిడ్కో ఇల్లు ఇవ్వాలని నిర్ణయించడంపై ఆంధ్రప్రదేశ్ వ్యవ సాయ కార్మిక సంఘం పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు హర్షం వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా పెంటపాడు మండలంలోని జట్లపాలెం, పెంటపాడు, ఆకుతీగపాడు, కస్పా పెంట పాడు, వల్లూరుపల్లి గ్రామాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ఆయన ఆశాభావం తెలిపారు.

సారా తరలిస్తున్న వ్యక్తిపై కేసు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : మండలంలో మంగపతి దేవి పేట గ్రామ శివారు ముద్దప్పగూడెం గ్రామం వెళ్లే మార్గంలో తనిఖీలు నిర్వహిస్తుండగా గుమ్మడి రమణ అనే వ్యక్తి టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై 20 లీటర్ల నాటు సారా అక్రమంగా తీసుకు వెళ్తుండగా అతనిని అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కె. వీరబ్రహ్మం తెలిపారు. సారా తరలిస్తున్న వ్యక్తి పై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. అక్రమంగా సారా తయారుచేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ తనిఖీలలో సబ్ ఇన్స్పెక్టర్ జి. సునీల్ కుమార్, ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి మూడో శనివారం స్వచ్ఛతా కార్యక్రమాలు

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు జిల్లాలో ఇకపై ప్రతి మూడో శనివారం "స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్" కార్యక్రమాన్ని నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్టు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో కలెక్టర్ వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశమై ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు తగిన సూచనలు, ఆదేశాలను జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమ నిర్వహణకు సంబంధించిన మార్గదర్శకాలను ఇప్పటికే ప్రభుత్వం జారీ చేసిందన్నారు. ఈ నెల 18వ తేదీన కడప జిల్లా మైదుకూరులో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. సమావేశంలో డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామీణ నీటి సరఫరా అధికారి బి.వి.నాగేశ్వరరావు, డిపిఓ అరుణ శ్రీ, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, డ్వామా పిడి కే సిహెచ్ అప్పారావు, డిఆర్డిఏ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఐటీడీఏ పీవోగా రాములు నాయక్

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం: కెఆర్ పురం సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ నూతన పీఓగా కె. రాములు నాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మండలంలోని బుసరాజుపల్లి ఉన్న టిడిపి నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులును పీఓ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పరిధిలోని గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని పీఓ రాములు నాయక్ ట్రైకార్ చైర్మన్ శ్రీనివాసులును కోరారు.

నిరక్షరాస్యులను అక్షరాసులుగా తీర్చిదిద్దుదాం : ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలంలో నిరక్షరాస్యులకు ఉల్లాస్ కార్యక్రమం ద్వారా అందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దుదామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గణపవరం మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిణి ఆర్. బేబీ శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం గణపవరం మహిళా సమాఖ్య భవనంలో ఏపిఎం ఎస్ ఎస్ అమ్మీరునిషా అధ్యక్షతన శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గణపవరం మండలంలోని నిరక్షరాస్యులకు ఉల్లాస్ కలెక్టర్ ఆదేశాల మేరకు శిక్షణ వివోఏ లకు కార్యక్రమం నిర్వహించారు. ఏపిఎం మాట్లాడుతూ నిరక్షరాస్యులైన వయోజనులకు సాంకేతిక విద్య, క్రియాత్మకవిద్య, ఆర్థిక విద్య, అభ్యాసకులకు నేర్పించుటకు వివోఏలుగా పనిచేస్తున్న వారిని వాలంటీర్లుగా పనిచేసేం దుకు ఎంపిక చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పల్లి వెంకట సత్యనారాయణ, సీసీలు, వివోఏలు తదితరులు పాల్గొన్నారు.

నేడు స్వచ్ఛతా దినోత్సవం

విశాలాంధ్ర-టి నరసాపురం: నేడు స్వచ్ఛతా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఎంపిడీఓ జి.మణి కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛతా దినోత్సవం కార్యక్రమంలో భాగంగా శనివారం పారిశుధ్యం పై ప్రతిజ్ఞ, మానవహారం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాల వద్ద పొదలు తొలగించి మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్ర మంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

పదోన్నతి పొందిన డ్రైవర్లకు వేతనాలు చెల్లించాలి

ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు నగర పాలక సంస్థ ప్రజారోగ్య శాఖ, ఇంజనీరింగ్ శాఖలో పని చేస్తూ హెవీ వెహికల్ డ్రైవర్లుగా పదోన్నతి పొందిన డ్రైవర్లకు పదోన్నతి పొందిన వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 2022 మార్చి 30వ తేదీన నగరపాలక సంస్థ ప్రజారోగ్య శాఖలో పనిచేస్తున్న 8, ఇంజనీరింగ్ శాఖలో పనిచేస్తున్న ఒకరికి హెవీ వెహికల్స్ డ్రైవర్లుగా పదోన్నతి ఇవ్వడానికి నగరపాలక సంస్థ ఆమోదం తెలిపిందన్నారు. రవాణా శాఖ, స్టాండింగ్ కౌన్సిల్ తమ అనుమతులు జారీ చేసిన తర్వాత నగరపాలక సంస్థ ఆదేశాలు జారీ చేసిందని, ఆనాటి నుండి నేటి వరకు అనగా 34 నెలలుగా పదోన్నతి పొందిన డ్రైవర్లకు డ్రైవర్ల స్కేల్ ప్రకారం వేతనాలు చెల్లించకుండా, వర్కర్లకు చెల్లించే విధంగా వేతనాలు చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. వార్షిక ఇంక్రిమెంట్లు, అడాక్ ఇంక్రిమెంట్లు ఇవ్వకుండా 9 మంది డ్రైవర్లకు జీతభత్యాలలో లక్షలాది రూపాయలు నష్టం కలిగించారని విమర్శించారు. నగరపాలక సంస్థ మేయర్, కమిషనర్,అదనపు కమిషనర్‌కు పలు మార్లు విజ్ఞప్తి చేసినా పెడచెవిని పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదోన్నతి పొందిన 9 మంది డ్రైవర్లకు తక్షణం అడాక్ ఇంక్రిమెంట్లు, వార్షిక ఇంక్రిమెంట్లు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. డ్రైవర్ల సమస్య పరిష్కారం కానిపక్షంలో ఫిబ్రవరి మొదటి వారం నుండి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూని యన్ కార్యదర్శి, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి ఏ అప్పలరాజు మాట్లాడుతూ పదోన్నతి పొందిన డ్రైవర్లకు వర్కర్ల జీతాలు చెల్లిస్తూ వెట్టి చాకిరి చేయించుకుంటు న్నారని విమర్శించారు. తోటి డ్రైవర్లకు, పదోన్నతి పొందిన డ్రైవర్లకు వేతనాలలో రూ.25 వేలు వ్యత్యాసం ఉందన్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ మేనేజ్మెంట్ స్పందించి పదోన్నతి పొందిన డ్రైవర్లకు వేతనం,వార్షిక ఇంక్రి మెంట్లు, అడాక్ ఇంక్రిమెంట్లు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమా వేశంలో తాడేపల్లి శేఖర్, అంతర్వేది శేఖర్, ఎ.బి. ఆంథోనీ పాల్, పంతం వెంకటేశ్వరరావు, గాడి అప్పారావు, మోదుగు గోవిందు, పాల్గొన్నారు.

ప్రభుత్వాలు సరైన క్రీడలను ప్రోత్సహించాలి

సంక్రాంతి సంబరాలలో వక్తలు

విశాలాంధ్ర-ఏలూరు: ప్రభుత్వాలు మంచి క్రీడలను ప్రోత్సహించకుండా చెడు క్రీడలైన కోడిపందాలు,పేకాట,జూదం లాంటివి ప్రోత్సహిస్తూ ప్రజల్ని చెడు మార్గాల వైపు పయనించేలా చేస్తున్నాయని సిపిఐ, బికెఎంయు, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ నాయకులు విమర్శించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఏలూరు 27 డివిజన్ కండ్రికగూడెం శ్రీరాజరాజేశ్వరి నగర్ లో సంక్రాంతి సంబరాలు ఏఐఎస్ఎఫ్,ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. బాల బాలికలకు నిర్వహించిన పరుగు పందెం పోటీలను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగా ప్రభాకర్ ప్రారంభించారు. మహిళలకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్ పోటీలతోపాటు, బాలురకు సోస్లైకింగ్ బాలికలకు లెమన్ స్పూన్ పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన వారికి సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య,ఏఐవైఎఫ్ ఏలూరు జిల్లా కో కన్వీనర్ తొర్లపాటి రాజు, జిల్లా నాయకులు టి. బాబు,ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సాయికుమార్, ఏలూరు జిల్లా కోశాధికారి ఎం. క్రాంతి కుమార్, బి కే యం యు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు,ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా కార్యదర్శి మన్నవ యామిని, న్యాయవాది తోట స్వరూప్, బోడెం వెంకట్రావు, నాగం అచ్యుత్, నాగమణి, విజయ మెస్ సుధాకర్ తదితరులు బహుమతులు అందజేశారు.

విద్యుత్ సబ్ స్టేషన్ ముట్టడించిన రైతులు

విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతున్నాయంటూ ఆందోళన

విశాలాంధ్ర - ముసునూరు: గత ప్రభుత్వ హయాంలో రోజుకు 9 గంటల చొప్పున వ్యవసాయ మోటార్లకు 3ఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తే ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం 7 గంటలు మాత్రమే సరఫరా చేయడంతో రైతులు తాము పండించే పంటలకు నీరందక ఎండిపోతున్నాయంటూ ఆందోళన చేపట్టారు. శుక్రవారం ముసునూరు మండలం చిల్లబోయినపల్లి గ్రామ రైతులు స్థానికంగా ఉన్న సబ్ స్టేషన్ ను ముట్టడించి విద్యుత్ సరఫరా 9 గంటలూ ఎటువంటి అంతరాయం లేకుండా సరఫరా చేయాలంటూ నిరసనలు తెలిపారు. వేలకు వేలుపెట్టుబడి పెట్టి తాము పండించే మొక్కజొన్న, పొగాకు తదితర పంటలకు సకాలంలో నీరందకపోతే పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోతామంటూ రైతులు వాపోయారు. మెట్ట ప్రాంతమైన ముసునూరు మండలంలో రైతులకు 9 గంటల కరెంటు తప్పనిసరిగా ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కండిపు రామగిరి, బుజ్జి లతోపాటు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

స్వచ్ఛత ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

- ప్లాస్టిక్ నియంత్రణకు అడుగులు వేయాలి
- కలెక్టర్ కె. వెట్రిసెల్వి

విశాలాంధ్ర - ఏలూరు : జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని గ్రామ స్థాయి నుండి మండల స్థాయి అధికారుల వరకూ ప్రతి ఒక్కరూ అంకిత భావంతో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి వివిధ శాఖల జిల్లా అధికారులు, డివిజన్, మండలస్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు తగిన సూచనలు, ఆదేశాలను జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమ నిర్వహణకు సంబంధించి ఇప్పటికే మార్గదర్శకాలను అందరికీ కమ్యూనికేట్ చేసినట్టు తెలిపారు. ఆ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు శ్రద్ధ చూపాలన్నారు. ప్లాస్టిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. మార్కెట్ యార్డ్, రైతు బజారుల్లో పరిశుభ్రవాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై కళాశాల,పాఠశాల స్థాయిలో క్విజ్, డ్రాయింగ్ తదితర పోటీలను నిర్వహించాలన్నారు. రంగవల్లుల పోటీలను కూడా చేపట్టాలన్నారు. గ్రామాల ముఖద్వారం ప్రాంతాల్లో చెత్తపేరుకుపోకుండా పరిశుభ్ర వాతావరణం ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణలో పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ,పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కీలక భూమిక పోషించాల్సి ఉందని, అందుకు తగ్గట్టుగా ఆయా శాఖల అధికారులు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించే అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. పెద్ద ఎత్తున ప్రజల భాగస్వామ్యంతో శ్రమదానం, మానవ హారాన్ని నిర్వహించాలని సూచించారు. ప్రతిజ్ఞ కార్యక్రమాలను కూడా నిర్వహించాలన్నారు. ఎన్ఎస్ఎస్, ఎన్ సిసి విద్యార్థులను కూడా భాస్వామ్యం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు, జెడ్పి సిఇఓ కె. సుబ్బారావుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

వృద్ధులకు సాయం బాధ్యత

విశాలాంధ్ర -కొవ్వూరు : ఉన్నతమైన జీవితాన్ని సాగిస్తూ వృద్ధాప్యంలో నా అనేవారు తోడు లేక వృద్ధాశ్రమాలలో జీవిస్తున్న వృద్ధులకు సహాయపడడంలో బాధ్యత కలిగి ఉండాలని కొడాలి సుకృత్ తన్వి అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కొవ్వూరు పట్టణంలోని వాత్సల్య వృద్ధాశ్రమ నందు వృద్ధులకు శుక్రవారం భోజనాలను అందించారు. ఈ సందర్భంగా సుకృత్ తన్వి మాట్లాడుతూ వృద్ధాప్యంలో వృద్ధులు ఎన్నో ఇబ్బందులకు గురవుతూ ఉంటారని అలాంటివారిని చేరదీసి వారికి పరిచర్యలు చేస్తున్న వాత్సల్య వృద్ధాశ్రమం నిర్వాహకులు అభినందనీయులన్నారు. కుటుంబాల్లో జరిగే శుభకార్యాలలో వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు కనీస సేవలు అందించడంలో అందరూ ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొడాలి రమ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బెల్లంతో తులాభారం

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి బాల దుర్గమ్మ ఆలయంలో శుక్రవారం అంగరంగ వైభవంగా రెండు తులాభార కార్యక్రమాలు జరిగాయి. హైదరాబాదుకు చెందిన చిందం గణేష్ వెంకటలక్ష్మి దంపతుల కుమార్తె హన్సికకు, ఇదే విధంగా చాగల్లు గ్రామానికి చెందిన వీరవల్లి చిరంజీవి వనిత దంపతుల కుమారుడు విహాన్ శ్రీరామకు మట్టి బెల్లంతో తులాభారం నిర్వహించారు. అంతకుముందు అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పైడికొండల సత్యనారాయణ కోశాధికారి కామిశెట్టి దుర్గారావు కమిటీ సభ్యులు కామిశెట్టి మంగ మాతు సీత పిన్నమనే వెంకటకృష్ణ జాజిమొగ్గల ప్రభాకరరావు గారపాటి అప్పారావు పైడికొండల రత్నం కామిశెట్టి ధర్మరాజు స్థానిక భక్తులు తంగేళ్ల చంద్రం మహిళా భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

పంపన ప్రసాద్ నేత్రదానం

విశాలాంధ్ర - తాళ్లరేవు : కాకినాడ జిల్లా తాళ్ళరేవు గ్రామానికి చెందిన ప్రముఖ ఎల్ఐసి ఏజెంట్ పంపన ప్రసాద్ శుక్రవారం తెల్లవారు జామున ఆకస్మిక మృతి చెందారు. భార్య రమా, కుమారుడు అనిల్, తమ్ముడు బుజ్జితో తాళ్ళరేవు లయన్స్ క్లబ్ సభ్యులు నరేంద్రను సంప్రదించి ప్రసాద్ కార్నియాలను కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్‌కి అందజేశారు. ఐ బ్యాంక్ టెక్నీషియన్ రవి కార్నియాలను సేకరించారు. కుటుంబ సభ్యులను కటాడి రమేష్, బిళ్ళకుర్తి శ్రీనివాసరెడ్డి, చోడే శ్రీనివాస్, బొంతు మోహన్, దొర తదితరులు పరామర్శించారు.

భూముల రీ సర్వే పూర్తి చేయాలి : ఆర్డీవో

విశాలాంధ్ర - ఆలమూరు : జొన్నాడ రెవెన్యూ పరిధిలోగల జొన్నాడ, మూలస్థానం గ్రామాల్లో భూముల రీ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని కొత్తపేట ఆర్డీవో పి శ్రీకర్ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం ఆయన మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ కెజె ప్రకాష్‌బాబు సమక్షంలో రెవెన్యూ అధికారులు, సర్వేర్లతో వర్క్ షాప్ నిర్వహించి, షెడ్యూల్ ప్రకటించారు. షెడ్యూల్ ప్రకారం ఈ ఏడాది ఏప్రిల్ 17లోపు జొన్నాడ రెవెన్యూ భూముల రీ సర్వే పూర్తి చేయాలన్నారు. ఇందులో భాగంగా ముందుగా జరిగిన సర్వే, జరగాల్సిన సర్వే పైన స్థితిగతులపై ఆయన వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములను రీ సర్వేలో ఏటువంటి అవకతవకలు జరగకుండా వేగంగా పనులు పూర్తి చేయాలన్నారు. సమగ్ర భూ సర్వేలో గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వాలిడేషన్‌లు పూర్తి చేసి ఆన్లైన్లో నమోదులు చేయాలన్నారు. మండల రెవెన్యూ పరిధి 15 గ్రామాల్లో ఈ గ్రామం మినహా మిగిలిన గ్రామాలన్నీ ఇప్పటికే సర్వే పూర్తయినట్లు ఆయన తెలిపారు. ఇందుకు ప్రభుత్వం నుంచి కచ్చితమైన ఆదేశాలు అందాయని రైతులు సహకరించాలని ఆయన కోరారు. భూముల గుర్తింపు, ఆన్‌లైన్ నమోదుల్లో తప్పులు దొర్లకుండా రైతుల సహకారంతో సమగ్రంగా పూర్తి చేయాలని ఆయన అధికారులకు చివరగా కచ్చితమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సుబ్బరాజు, డిప్యూటీ సర్వేయర్ ప్రభాకరరావు, మండల సర్వేయర్ ప్రభావతి, ఆర్ఐ రామాయమ్మ, విఆర్ఒలు, విలేజ్ సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే సమర్థవంతంగా నిర్వహించాలి: ఆర్డీవో

విశాలాంధ్ర - సామర్లకోట : రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా ఎవరి భూములు వారికే దక్కే విధంగా రీ సర్వే అప్డేట్, డేటా ఎంట్రీ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని పెద్దాపురం ఆర్డీవో కె రమణి అన్నారు. సామర్లకోట జిల్లా మహిళా సాధికార సంస్థ అయిన టిటిడిసి శిక్షణా కేంద్రంలో డివిజన్ పరిధిలోని 11 మండలాలకు చెందిన మండల సర్వేయర్లు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్లు, గ్రామ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమణి మాట్లాడుతూ భూ సమస్యలకు సంభందించి ఎలాంటి ఇబ్బందులు నమోదైనా వాటిని సానుకూలంగా పరిష్కరించాలన్నారు. దానికి సంభందించి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సూచనలు అందించినందున వాటిని అనుసరించి గ్రామాల్లో రైతులకు సేవలనందించాలన్నారు. ఈ సందర్భంగా రీ సర్వే, డేటా ఎంట్రీపై పలువురు మండల స్థాయి అధికారులకు పలు విషయాలు వివరించారు.

'స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ దివాస్ '

విశాలాంధ్ర - గండేపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమం నిర్వహించాలని ఎంపీడీవో నాతి బుజ్జి మండల స్థాయి అధికారులకు పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ వారిచే నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొన్నారు. దేశంలోనే అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా ఆంధ్ర ప్రదేశ్‌ను తీర్చి దిద్దాలనే లక్ష్యముతో 12 నెలలకు 12 థీంలతో ప్రతి నెలా 3వ శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్, కార్యక్రమంలో మండలంలోగల అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలు, అన్ని గ్రామ పంచాయతీల యందు స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ షాన్మోహన్ సగిలి వీడియో కాన్ఫరెన్స్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు అనుసరించి మండల స్థాయి అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమముపై ఎంపీడీవో తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి చంద్రరావు, ఇ ఓపిఆర్డి చంద్రశేఖర్, ఏపీవో ఆర్ గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

బీచ్ రోడ్ రాకపోకల నిలిపివేత

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : బీచ్ రోడ్లోకి అధిక సంఖ్యలో పర్యాటకులు చేరుకోవడంతో బీచ్‌రోడ్‌లో రాకపోకలను గురువారం పోలీసు నిలిపివేశారు. ఉప్పాడ బీచ్ రోడ్‌లో నుంచి వాహనాలను పిఠాపురం వైపుగా దారి మళ్లిస్తున్నారు. బీచ్ రోడ్‌లో అధిక సంఖ్యలో పర్యటన చేరుకోవడంతోపాటు వాహనాలను బీచ్‌రోడ్‌లో నిలిపివేయడంతో బీచ్‌రోడ్‌లో పూర్తిగా ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో పోలీసులు ఉప్పాడ బీచ్ రోడ్డు సెంటర్లోకమా, వాకలపూడి లైట్ హౌస్ వద్ద వాహనాలను దారి మళ్లిస్తున్నారు.

జాతీయ రహదారి భద్రత వారోత్సవాలు

విశాలాంధ్ర - యానాం : భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ యానాం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 17 నుంచి 23 వరకు యానాం పరిసర ప్రాంతాల్లో యువతతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని ట్రాఫిక్ ఎస్ఐ శేరు నూకరాజు, ఎన్ఎస్ఎస్ రీజనల్ కోఆర్డినేటర్ చింతపల్లి కృష్ణ సుధాకర్, జిల్లా యువజన అధికారి తిర్రే గోపి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వాసంశెట్టి ఆనంద్ ప్రారంభించారు. వలంటీర్లకు టీ షర్టు, క్యాపులు అందజేశారు. రహదారి భద్రతపై యానాం ప్రధాన కూడలిలో 17 నుంచి 23 వరకు ప్రజలకు అవగాహన కల్పిస్తారని తిర్రే గోపి తెలిపారు.

ఆశల పల్లకిలో తెలుగు తమ్ముళ్లు

ద్విసభ్య కమిటీ నాయకులకు రాష్ట్రస్థాయి పదవులు కేటాయించాలని వినతి

విశాలాంధ్ర -కొవ్వూరు : కొవ్వూరు నియోజకవర్గం నాయకులు కార్యకర్తలలో ఆశలు చిగురిస్తున్నాయి. దీనికి కారణం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం టీడీపీకి చెందిన మంత్రులు, ఎంపీలు జోనల్ స్థాయి నాయకులతో అమరావతిలో సమావేశమైనట్లు విశ్వసనీయమైన సమాచారం. ఈ సమావేశంలో స్థాయి నాయకులతో పాటు కార్యకర్తలకు ఎటువంటి నామినేటెడ్ పదవులు కేటాయించాలో సమావేశంలో చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తయిన సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు దృష్టి సారించారు. దీనిలో భాగంగా ప్రతి నియోజకవర్గంలోనూ కష్టపడ్డ ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు ఎంతో శ్రమపడి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారన్న భావన సీఎం మదిలో ముద్ర వేసుకుంది. చాలా నియోజకవర్గాలలో తమను పార్టీ అధిష్టానం అసహనంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపధ్యంలో సీఎం చంద్రబాబు ఈ వ్యవహారాలలో చురుగ్గా వ్యవహరించాలని నిర్ణయం తీసుకున్నారు. పార్టీ విజయానికి ఎంతో కృషి చేశామని గుర్తించడం లేదు అన్న సమస్యకు నేడు జరిగిన సమావేశంలో పరిష్కారం లభిస్తున్నట్లు అయ్యింది. ఇప్పటికే రాష్ట్ర డైరెక్టర్‌గా వేమగిరి వెంకట్రావు అదే విధంగా రజక కార్పొరేషన్‌కు కొవ్వూరు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన సతీష్‌ను నియమించగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నేపథ్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలలో ఆశాభావం వ్యక్తమవుతోంది. కొవ్వూరు నియోజకవర్గంలో టిడిపిలో వర్గ విభేదాలతో కొట్టుమిట్టాడుతున్న సమయంలో సమస్యను గుర్తించి ద్విసభ్య కమిటీని ఏర్పాటు చేసి దానికి నాయకులుగా టీడీపీ సీనియర్ నాయకులు జొన్నలగడ్డ చౌదరి. కంఠమని రామకృష్ణలను నియమించారు. దీంతో ఆ బాధ్యతలను భుజాన వేసుకున్న ఇరువురు నాయకులు పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పోరాటాలను నిర్వహించారు. చంద్రబాబు జైల్లో ఉన్నప్పుడు నియోజకవర్గంలోని మూడు మండలాల్లో నిరసన శిబిరాలను ఏర్పాటు చేసి విజయవంతమయ్యారు. ఇటీవల జరిగిన ఎన్నికలలో కొవ్వూరు నియోజకవర్గం నుంచి ముప్పిడి వెంకటేశ్వరావును అత్యధిక మెజార్టీతో గెలిపించి తమ సత్తాను చాటుకున్నారు. ఈ విషయమే పార్టీ నాయకులు కార్యకర్తలు ఏకతాటిపైకి వచ్చి ఈ విజయంలో పాలు పంచుకున్నారు. ఈ నేపథ్యంలో కొవ్వూరు నియోజకవర్గ ద్విసభ్య నాయకులు జొన్నలగడ్డ చౌదరి కంఠమని రామకృష్ణలకు రాష్ట్రస్థాయిలోనూ తమకు నియోజక వర్గం స్థాయిలోనూ నామినేటెడ్ ఇచ్చి గుర్తించాలని కొవ్వూరు నియోజకవర్గ తమ్ముళ్లు కోరుతున్నారు.

గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష

విశాలాంధ్ర - కాకినాడ : ఈ నెల 26న కాకినాడ పోలీస్ పేరేడ్ గ్రౌండ్లో జరగనున్న 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు పటిష్టమైన విస్తృత ఏర్పాట్లు చేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయం లోని వివేకానంద సమావేశ మందిరంలో గణతంత్ర దినోత్సవ సన్నాహక ఏర్పాట్లపై జిల్లా అధికారుల తో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాతో కలిసి సమీక్షించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ మాట్లాడుతూ ఈ నెల 26 ఉదయం 9గంటలకు కాకినాడ పోలీస్ పేరేడ్ గ్రౌండ్లో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. ఈ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొననున్న దృష్ట్యా పటిష్టమైన బందో బస్తుతో పాటు విస్తృతమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ వేడుకలకు హాజరయ్యే ప్రముఖులతో పాటు ప్రతి ఒక్కరికీ తగిన సీటింగ్ ఏర్పాట్లు, ఇతర అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసు కోవాలన్నారు. పోలీస్ పేరేడ్ ప్రాంగణంలో తాగునీటి వసతి, పారిశుధ్య నిర్వహణ, భారీ కేడింగ్, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆయన ఆదేశించారు. వివిధ శాఖల వారీగా చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించి ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తగు సూచనలు జారీ చేశారు. ముందు డీఆర్వో జె వెంకటరావు వివిధ శాఖల వారీగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై వివరించారు. వాటిలో ముఖ్యంగా పోలీస్ శాఖ తరపున పోలీస్ పేరేడ్ గ్రౌండ్ లోపల వెలుపల చేపట్టవలసిన బందోబస్తు ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ వంటి ఏర్పాట్లపై సూచనలు జారీ చేశారు. సమాచార పౌర సంబంధాల శాఖ ద్వారా ముఖ్య అతిథి గణతంత్ర దినోత్సవ సందేశం తయారీ, ప్రచురణతో పాటు సరిపడిన ప్రతులు సిద్ధం చేసి అందరికీ పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా పటిష్టమైన పబ్లిక్ అడ్రస్ సిస్టం, మీడియా లైవ్ కవరేజ్ నిమిత్తం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు వివిధ శాఖలకు సంబంధించిన శకటాల ప్రదర్శనకు చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ప్రధాన వేదిక అలంకరణ ఇతర ఏర్పాట్లు సహా స్టేడియంలో ఇతర వసతులపై తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్, కాకినాడ రూరల్ తహశీల్దార్లను ఆదేశించారు. ఈ సమావేశంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ శ్రీనివాస రావు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రజల హక్కులు కాపాడేందుకు భాగస్వాములు కావాలి : శ్రీదేవి

విశాలాంధ్ర - సామర్లకోట : గిరిజన మండలాల్లో నివసించే ప్రజల హక్కులను కాపాడేందుకు 'పెసా' చట్టం అమలు చేస్తున్నందున దానిలో అధికారులంతా భాగస్వాములు కావాలని ఏపీఎస్ఐ ఆర్డి జాయింట్ డైరెక్టర్ శ్రీదేవి పిలుపునిచ్చారు. సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రంలో రెండు బ్యాచ్‌లుగా ఇచ్చే మాస్టర్ ట్రైనీల శిక్షణ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. శిక్షణాకేంద్రం ప్రిన్సిపాల్ జె వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన శిక్షణకు జెడి శ్రీదేవి, డిప్యూటీ డైరెక్టర్ జె రామానాదంలు పాల్గొన్నారు. తొలుత జెడి జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గిరిజన మండలాల్లో ఫిబ్రవరి నెలలో పెసా చట్టంపై ప్రజలకు, అధికారులకు, ఎస్‌హెచ్‌జి సభ్యులకు, ఎన్‌జిఒలకు ఈ మాస్టర్ ట్రైనీల ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. 5 జిల్లాలకు సంబంధించి 108 మంది అధికారులు ఈ శిక్షణలో పాల్గొన్నట్లు చెప్పారు. ప్రతి మండలంలో శిక్షణలు ఇచ్చేందుకు 6గురు సభ్యులు ఉంటుందగా వారిలో ఎంపిడివో, ఈఓపిఆర్డి, నలుగురు పంచాయితీ కార్యదర్శులు ఉంటారన్నారు.రెండో బ్యాచ్‌కు ఈనెల 21,22 తేదీల్లో ఈ శిక్షణలు జరగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, ఫ్యాకల్టీలు పి శ్రీనివాసరావు, వి ప్రసాద్, కెఆర్ నిహారిక, వి ఆంజనేయులు, ఎం చక్రపాణి రావు, డిఆర్ఎన్ పద్మజ తదితరులు పాల్గొని మాస్టర్ ట్రైనీలకు శిక్షణ ఇచ్చారు.

రోడ్డు ప్రమాద బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే నానాజీ

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం, ప్రత్తిపాడు మండలం ఒమ్మంగిలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గోపాల చెరువు వద్ద టెంపో ట్రావెల్ కాలువలో అదుపుతప్పి బోల్తా కొట్టడం వల్ల సుమారు 28 మందికి తీవ్రగాయలయ్యాయి. మెడికవర్ హాస్పిటల్స్, కాకినాడ నందు చికిత్స పొందుతున్న క్షతగాత్రులను కాకినాడ రురల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పరామర్శించడం జరిగింది. ఈ ప్రమాదానికి గురైన వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ ఘటన ఎంతో భాదాకరమైనది అని సుమారు 28 మంది క్షతగాత్రులలో 8 మందికి తీవ్ర గాయాలు కాగా, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది అని, మిగిలిన వాళ్ళకి ఎముకలు విరగటం జరిగింది అని వైద్యులు తెలిపారు. అతి పెద్ద అత్యవసర విభాగం, అనుభవం కలిగిన వైద్యులు 24/7 మెడికవర్ హాస్పిటల్స్, కాకినాడ నందు అందుబాటులో ఉండటం వల్ల ఈ అత్యవసర పరిస్థితిని అతి తక్కువ సమయంలో క్షతగాత్రులు అందరికీ చికిత్సను అందించడంలో బృందంగా విజయవంతం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేసారు. డా జయ ప్రకాష్, డా అరుణ్ కుమార్, డా జగదీశ్వరరావు, డా కళ్యాణ్ రవితేజ, డా ఉప్పల సుబ్బారావు, డా రాజా అమరేంద్రతో కూడిన వైద్య బృందం మరియు హాస్పిటల్ సిబ్బందితో కూడిన బృందం ప్రమాదానికి గురైన వారికి చికిత్స అందించడంలో భాగస్వాములై విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించారు అని తెలిపారు.

ఆక్రమణల తొలగింపు

విశాలాంధ్ర - కడియం : మండల కేంద్రం కడియం నుంచి వీరవరం వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగింపు పనులు శుక్రవారం కడియం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కడియం బొబ్బిలి బ్రిడ్జి దగ్గర నుండి హైస్కూల్ వరకు రహదారికి ఇరువైపులా ఆక్రమణ పెరిగిపో యాయి అన్నారు. రహదారికి ఇరువైపులు ఉన్న డ్రైనేజీ ఆక్రమించిని వ్యాపారులు ముందుకు రావడం వలన వాహనాలు రోడ్డుపై నిలుపుతున్నారని, దానివల్ల వచ్చిపోయే వాహనాలకు ఇబ్బంది కలుగుతున్నాయన్నారు. అందువల్ల ఆక్రమ ణలు తొలగించే పనులు చేపట్టినట్లు సెక్రటరీ తెలిపారు. డ్రైనేజీలపై ఎటువంటి కట్టడాలు కట్టిన, ఆక్రమణలు చేపట్టిన చర్యలు తప్పవని తెలిపారు.

వెంకటేశ్వర స్వామికి విరాళం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : కోనసీమ తిరుమల ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నూతన అన్న ప్రసాద భవన నిర్మాణానికి దాతలు భారీ విరాళం సమర్పించారు. ఆలయ సమీపంలో నిర్మించనున్న వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి కామవరపు కోట వాస్తవ్యులు యువిఆర్ ఎస్ఎల్ ప్రసాద్, వారి కుటుంబ సభ్యులు రూ.54,018లు విరాళంగా అందజేసారు. ఈ సందర్భంగా వారికి దేవస్థానం నల్లం సూర్య చక్రధరరావు డిప్యూటీ కమిషనర్, పి రాంబాబు ఆలయ సూపరిటెండెంట్ స్వామి చిత్రపటాలు ఇచ్చి అభినందించారు.

నిర్లక్ష్య డ్రైవింగ్‌తో రోడ్డు ప్రమాదాలు

విశాలాంధ్ర -కొవ్వూరు : నిర్లక్ష్యంగా వాహనాలను నడపడం వలన రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలను కోల్పోతున్నారని, రోడ్డు ప్రమాదాలను నివారించడంలో ప్రతి వాహనదారుడు బాధ్యతగా వ్యవహరించాలని కొవ్వూరు పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి విశ్వం తెలిపారు. జనవరి 11 నుంచి జనవరి 17 వరకు నిర్వహించు ప్రపంచ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా శు క్రవారం కొవ్వూరు పట్టణంలోని ఆర్టీసీ డిపో మేనేజర్ వై వివిఎన్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. పి విశ్వం మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు భద్రత ప్రమాణాలను పాటిస్తూ వాహనాలను నడపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు ఆర్టిసి డిపో మేనేజర్ వై వివిఎన్ కుమార్ ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్ క్రికెట్ టోర్నీ విజేతగా వీరవరం

విశాలాంధ్ర - కడియం : కడియం మండలం, మురమండలో పిచ్చుగ కోటయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్టీఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ కాకతీయ యూత్ ఆధ్వర్యంలో ముగింపు ఘనంగా నిర్వహించారు. 15 జట్ల మధ్య హోరాహోరీగా జరిగిన క్రికెట్ టోర్నమెంట్లో విన్నర్‌గా వీరవరం కప్పు గెలుసుకుని రూ.10,000 నగదు బహుమతిని, రన్నర్‌గా నిలిచిన కడియం కప్పు రూ.5,000 నగదు బహుమతిని తెలుగుదేశం నాయకుడు వట్టికూటి జానకి రామయ్య (దత్తుడు) కాకతీయ యూత్ సభ్యులతో స్థానిక నాయకులతో కలిసి బహుమతులు అందచేసారు. ఈ కార్యక్రమంలో మురమండ సాగునీటి సంఘం అధ్యక్షుడు గన్ని రామారావు (పెద్ద బాబి), నల్లూరి రామకృష్ణ, షేక్ మీరాభాయ్, పోతుల శేషగిరి, బత్తుల కామేశ్వరరావు, పిల్లా వెంకట్రావు, తూలూరి శేషు, కాటే జ్యోతి బాబు, బొప్పన లోవరాజు, బత్తుల చిన్న గణేష్,11 మంది టీం సభ్యులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేతగా బుర్రిలంక జట్టు

విశాలాంధ్ర - కడియం : కడియం మండలం బుర్రిలంక ఎలిమెంటరీ పాఠశాలలో సంక్రాంతి సందర్భంగా మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ గత నాలుగు రోజులుగా నిర్వహించారు. మండలంలోని సుమారు 11 గ్రామాల నుండి క్రికెట్ జట్టు పోటీలు నిర్వహించగా శుక్రవారం జరిగిన ఫైనల్‌లో కడియం, బుర్రిలంక జట్టు పోటీ పడగా విజేతగా బుర్రిలంక జట్టు మొదటి స్థానం కైవసం చేసుకుంది. విజేతలకి కడియపులంక గ్రామ సర్పంచ్ పాతంశెట్టి రాంజీ, విజేతలకు మొమెంటో నగదు అందించారు. ఈ కార్యక్రమంలో బుర్రిలంక ప్రాథమిక ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు, గ్రౌండ్ సభ్యులు,కట్టా శివ,పుల్లా ఎన్.ఆర్ నాగిరెడ్డి దొరబాబు,పాఠం శెట్టి పట్టాభి. చిన్న రాము,గాద రాజా,నాగిరెడ్డి శంకర్,విష్ణు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి...

విశాలాంధ్ర - కాకినాడ : హెల్మెట్ ధరించి తమ అమూల్యమైన ప్రాణాలు కాపాడుకోవాలని కాకినాడ జిల్లా రోడ్డు ట్రాన్స్‌పోర్టు ఉప శాఖాధికారి కె శ్రీధర్ పిలుపునిచ్చారు. రోడ్డు భద్రత మాస ఉత్సవాల సందర్భంగా శుక్రవారం ఉదయం స్థానిక ఆర్టీవో ఆఫీసులో వివిధ ఆటో సంఘాల, ఇతర వాహనాల సంఘాల నాయకులతో రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అధికారులు సమావేశం అయ్యారు ఈ సందర్భంగా డిటిసి మాట్లాడుతూ 2024లో రోడ్ ప్రమాదృశ్య 1,70,000 మంది ప్రాణాలు కోల్పోయారని వారిలో చాలా మంది ధరించకపోవడం ముఖ్య కారణం అని తెలిపారు. అలాగే వాహనదారులు రావణాదార్లు తమ ప్రయాణం సుగమముగా జరిగే విధంగా అన్ని ఏర్పాటు చేసుకుని ముందుకు సాగాలని పిలుపుని చ్చారు. నాలుగు చక్రాల వాహన డైవర్లు తప్పనిసరిగా సీట్ బెల్టు ధరించాలని, అలాగే ద్విచక్ర వాహదారులు హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాల ని కోరారు. ప్రభుత్వం ఎన్ని రకాలు చర్యలు తీసు కుంటున్నా సరే వీరు సరైన డ్రైవింగ్ రక్షణ చర్యలు తీసుకోవడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. ఆటోలో ముగ్గురు కన్నా ఎక్కువ మందిని తీసుకెళ్లకూడదని స్కూల్ ఆటోలో ఆరుగురు విద్యార్థులు మించి ఎక్కించుకోకూడదని తెలిపారు. ప్రయాణ రక్షణ చర్యలు తీసుకొని వాహదారులపై ప్రభుత్వ ఆదేశాలను దృష్టిలో పెట్టుకుని తగిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే హిట్ అండ్ డ్రైవ్ కేసుల్లో మరణించిన వారికి ప్రభుత్వం నియమ నిబంధనలు ప్రకారము ఎప్పటికీ చాలామందికి ఆర్థిక సహాయం అందించామని గుర్తుచేశారు. వాహదారులు, డ్రైవర్లు, ఇతరులు తప్పనిసరిగా రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో మురళీకృష్ణ, డాక్టర్ పద్మావతి, రమణ, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

మా తాతల ఆచారాన్ని పాటిస్తున్నా...

విశాలాంధ్ర - జగ్గంపేట : మా తాతల దగ్గర నుండి వస్తున్న రామనామ సంకీర్తనలను నేను ఆలపిస్తున్నానని భద్రాచలం సమీపంలోని నాసరం గ్రామానికి చెందిన హరిదాసు తెలిపారు. మండలంలోని మల్లిసాల గ్రామం సుభిక్షంగా ఉండాలని ధనుర్మాసం నెల రోజులు నాసరం గ్రామానికి చెందిన హరిదాసు కుటుంబీకులు రామనామ సంకీర్తనలతో తిరిగారు. ఆఖరి రోజున ప్రతి ఇంటికీ వెళితే బియ్యం, కూరగాయలు, ఇతర కానుకలు ఇచ్చారు. ఇలా గ్రామంలోని వారు కానుకలు అందించి పండ్లు, శాలువాతో శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మా తాతయ్య, తరువాత మా నాన్న రామనామ సంకీర్తనలు పాడుతూ ఈ గ్రామంలో తిరగడం జరిగిందన్నారు. అలాగే ఇప్పుడు నేను గ్రామంలో ఆలపించడం జరుగుతుందన్నారు. ఐతే నేను పోలీసు ఉద్యోగం చేస్తున్నానని, నెలరోజులు సెలవు పెట్టి గ్రామంలో హరిదాసుగా రామనామాలు పాడటం జరిగిందన్నారు. మా తాతల కాలం నుంచి వచ్చిన ఈ ఆచారాన్ని నేను పాటిస్తున్నానని, ధనుర్మాసంలో రామనామ జపం చేయకుంటే గ్రామానికి అరిష్టాలు రావడంతో పాటు, మా కుటుంబంలోనూ చిక్కులు ఎదురౌతాయన్నారు. అందుకే ప్రతి ఏడాది ఇక్కడ రామనామ జపం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జగతం ఆనందరావు, ఎంపీటీసీ పైల శివరామకృష్ణ, గ్రామస్తులు జక్కి వీరాంజనేయులు, రెడ్డి ఆంజనేయులు, బందారు సత్యవతి, బందారు పెద్ద సత్యవతి, వాసిరెడ్డి లోవ మాస్టారు, వాసిరెడ్డి ప్రసాదు తదితరులు పాల్గొని ఆయనను సన్మానించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : చదువులమ్మ చెట్టు నీడలో చెట్టాపట్టాలేసుకుని కలిసితిరిగిన ఆ స్నేహితులు శుక్రవారం ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. సంక్రాంతికి స్వగ్రామాలకు విచ్చేసిన స్నేహితులంతా ఒక్కటై స్నేహబంధాన్ని మరింతగా బలపర్చుకొన్నారు. మండలంలోని లంపకలోవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996-97 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులంతా 28 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. ముందుగా అప్పట్లో తమతో కలిసి చదువుకుని విద్యార్థులు, విద్యాబుద్దులు నేర్పిన ఉపాధ్యాయులు పలువురు మృతి చెందారు. వారి ఆత్మకు శాంతిచేకూరాలని మౌనం పాటిస్తూ నివాళులు అర్పించారు. అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొని పాఠశాల ఆవరణలో ఆటపాటలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన మ్యూజికల్ ఛైర్ గేమ్‌లో విజేతలుగా నిలిచిన జల్లిగంపల సుభ, కూచిపట్ల గాయత్రి, రెడ్డి శ్రీలక్ష్మీలకు యూటీఎఫ్ మండల అధ్యక్షుడు కోడి శ్రీను చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో స్వయంగా వారి చేతుల మీదుగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో బర్ల సూర్యప్రకాశరావు, సూర్నీడి హరిబాబు, బొల్లు వీరనాగేశ్వరరావు, బొందలపు వెంకటరమణ, హరిదాసుల శివాజీ, ప్రగడ రామకృష్ణ, అర్బరపు కన్నయ్య, కందా రాజా, రామిశెట్టి రాజా, అనపర్తి సత్యనారాయణ, సంగన అరుణ్ కుమార్, గంటా మంగతాయారు, చక్కపల్లి సుజాత, ఎల్బూరి సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

20న జాబ్‌మేళా

విశాలాంధ్ర - కాకినాడ : 'వికాస' ఆధ్వర్యంలో ఈనెల 20న సోమవారం 'వికాస' కార్యాలయం, కలెక్టరేట్, కాకినాడలో "జాబ్‌మేళా" నిర్వహిస్తున్నారు. ఈ జాబ్‌మేళాలో మహీంద్రా ట్రాక్టర్స్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్, సూపర్‌వైజర్, మెకానిక్ హెల్పర్, హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్, కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజర్, ముత్తూట్ ఫైనాన్స్‌లో ట్రైనీ అసోసియేట్, ఐసాన్ ఎక్స్‌పీరియన్సెస్ కంపెనీలో టెలిసేల్స్ ఎగ్జిక్యూటివ్, ఇండో ఎంఐఎం, హోండాయ్ మోబీస్, పానాసోనిక్&స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగం, కల్పించనున్నారు. పై ఉద్యోగాలకు ఎస్‌ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమో, డిగ్రీ & బి టెక్ ఉత్తీర్ణులైన 35 సం.లోపు అభ్యర్థులు అర్హులు. నెలకు రూ.12,000 నుంచి రూ.20,000 వరకు జీతం+ఇన్సెంటివ్స్, భోజనం, వసతి & రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులందరూ ఈనెల 20న సోమవారం 'వికాస కార్యాలయం, కలెక్టరేట్, కాకినాడ' వద్ద ఉదయం 9.గం.లకు సర్టిఫికెట్స్ జిరాక్స్‌లతో హాజరుకావలెను. మరిన్ని వివరాలకు 7799376111, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.వికాసజాబ్స్.కాం సంప్రదించవలెను.

25న భారత రాజ్యాంగంపై వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 25న శనివారం భారత రాజ్యాంగంపై క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం భాష శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 76వ భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని 9, 10 తరగతి విద్యార్థుల కోసం భారత రాజ్యాంగం అనే అంశంపై క్విజ్ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పోటీ టీమ్ ఆధారంగా నిర్వ హించబడుతుందన్నారు. ప్రతి టీమ్‌లో ముగ్గురు సభ్యులు ఉండవలసి ఉంటుంది. సభ్యులు 9వ, 10వ తరగతులకు చెందిన విద్యార్థులే అయి ఉండాలి. పోటీ జనవరి 25వ తేదీన స్థానిక కలెక్టరేట్లో గోదావరి భవన్లో నిర్వహిస్తారన్నారు. ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహించి, తుది జట్లకు ఫైనల్ పరీక్షలు నిర్వహించబ డతాయి. విజేత జట్లకు కలెక్టర్ చేతుల మీదుగా జనవరి 26న రిపబ్లిక్ దినోత్సవ వేడుకలలో బహుమతులు ప్రదానం చేస్తారన్నారు. మరిన్ని పూర్తి వివరాల కొరకు-కెఎస్‌వి కృష్ణారెడ్డి 9492146689 -ప్రక్కి వీర బ్రహ్మానందం 9949536081 -డాక్టర్ ఎస్‌కె సలీం భాష జిల్లా విద్యా శాఖాధికారి, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వారిని సంప్రదించ వచ్చున్నారు.

అందినకాడికి దోచేయ్?

- ప్రభుత్వ తప్పిదాలతో సామాన్యులకు అందని సినీ వినోదం
- థియేటర్ లీజు యాజమాన్యాలే బ్లాక్ మార్కెట్

విశాలాంధ్ర - జగ్గంపేట : అవకాశం వచ్చింది దోచేయ్ అన్న చందంగా తయారయ్యారు జగ్గంపేటలోని థియేటర్ లీజు యాజమాన్యాలు. అధిక రేట్లకు అమ్ముకోవచ్చని ప్రభుత్వం చిన్న అవకాశాన్ని వారు పెద్ద అవకాశంగా చేసుకుంటున్నారు. ప్రభుత్వం ఆమోదం తెలిపిన ధరల కంటే రెట్టింపు ధరలకు టిక్కెట్లను థియేటర్ యాజమాన్యాలు బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకుం టున్నాయి. ఒకప్పుడు పండగ వస్తే కుటుంబ సమేతంగా అందరూ కలిసి సినిమాకి వెళ్ళేవారు. పండక్కి ఇంటికి వచ్చిన అల్లుడికి చూపించే మర్యాదల్లో అదొక భాగం. సినిమాకి తీసుకువెళ్ళు నాన్న అని ప్రేమగా అడిగే బిడ్డలకు ఈ పండుగల్లో తండ్రి ఇచ్చే చిరు బహుమానం ఈ సినీ వినోదం. ఒక్క అల్లుడే కాదు ఇంటికి చుట్టాలు వచ్చినా, లేదా సరదాగా కుటుంబ మంతా కలిసి ఎక్కడికైనా వెళ్ళాలనుకున్నా అందరికి మొదటిగా గుర్తొచ్చేది సినిమా. అయితే రాష్ట్ర ప్రభుత్వ తప్పిదాలు కారణంగా ప్రస్తుతం సామాన్యుడికి ఇప్పుడు సినీ వినోదం లభించడం లేదు. కుటుంబ సమేతంగా సినిమాకు వెళ్ళాలి అంటే దాదాపు 1800 నుండి 2000 వరకూ ఖర్చు అవుతుంది. అలాగే థియేటర్లలో స్నాక్స్, కూల్ డ్రింక్స్‌కు మరో వెయ్యి ఖర్చు అవుతుంది. దీంతో సినిమాలు సామాన్యుడి అందని ద్రాక్షలా మిగిలిపోతు న్నాయి. ఇటీవల విడుదలైన పుష్ప 2, గేమ్ ఛేంజర్, డాకు మహారాజు, వెంకటేష్ నటించిన సంక్రాంతి వస్తున్నాం చిత్రాలు ఇలా అన్ని సినిమాల పరిస్థితి ఇలాగే వుంది. ప్రతి సినిమా టికెట్ ధర రూ.250 పైనే వుంటుంది. అందుకే సినీ వినోదం అనే ఆలోచనకు సామాన్యులు పూర్తిగా దూరమైపోయారు. ఇక కొందరు వినోద ప్రియులు ఎంతైనా తప్పేది ఏముందని వెంక టేష్ సినిమాకు ఎగబడుతున్నారు. అది థియేటర్ లీజు యాజమాన్యానికి ఆసరాగా మారింది. ముందుగానే విక్రయాలు జరిగినట్లు థియేటర్ వారు టిక్కెట్లను బుకింగ్ చేస్తున్నారని, వాటిని బయట వారి పేరుతో ఎక్కువ రేట్లకు విక్రయిస్తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. టిక్కెట్లను అధిక రేట్లను విక్రయించే థియేటర్లపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని వినోద ప్రియులు వాపోతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ జెవిఆర్ రమేష్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు.

క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యత : మంత్రి

విశాలాంధ్ర – అమలాపురం : క్రీడా రంగానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత నిస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రామచంద్రపురంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు గారి ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో 14వ ఆల్ ఇండియా & 20వ ఆంధ్రప్రదేశ్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్ పోటీలను మంత్రి వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎంపీ హరీష్ మాధుర్‌లు కలిసి ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో క్రీడాకారులను ఉద్దేశించి మంత్రి సుభాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో చదువుతోపాటు క్రీడలకు సమాన ప్రాధాన్యతనిస్తూ కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని మంత్రి సుభాష్ అన్నారు. ఒత్తిడి లేని విద్య విద్యార్థుల్లో మానసిక ఉల్లాసానికి దోహదపడుతుందన్నారు. రాష్ట్రాన్ని ఎడ్యుకేషనల్ హబ్‌గా మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లు విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. ఈ బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌లో 7 రాష్ట్రాలకు చెందిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, చత్తీస్గడ్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు అన్నారు. మరో ముఖ్య అతిథి అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ మాట్లాడుతూ ప్రతి జిల్లా కేంద్రంలోనూ క్రీడా హబ్‌ను ఏర్పాటు చేసి జాతీయస్థాయి శిక్షణ ఇస్తామన్నారు. వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే క్రీడాకారులకు మెరుగైన సదుపాయాలు కల్పించే విధంగా చర్యలు చేపడతామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిధులు రాబట్టి క్రీడాకారుల సంక్షేమానికి పాటుపడతామన్నారు. బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ సెలికాని స్టాలిన్, ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తిలు మాట్లాడుతూ ఈ బాస్కెట్బాల్ పోటీల్లో ఏడు రాష్ట్రాలకు సంబంధించి 29 పురుషుల జట్లు, 16 మహిళా జట్ల క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి,జనసేన పార్టీ ఇంచార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, కౌన్సిలర్ తోట అమ్మాజీ, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయండి : కలెక్టర్

విశాలాంధ్ర -భీమవరం : 26న కలెక్టరేట్ పెరేడ్ గ్రౌండ్‌లో 76వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని వశిష్ట సమావేశ మందిరంలో గణతంత్ర వేడుకలకు సంబంధించి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి అనేక ఆదేశాలు, సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వేదిక ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచడం ఆహుతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీటి వసతి తదితర అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలపై శకటాల రూపంలో ఏర్పాటు చేయాలని, ఎగ్జిబిషన్ స్టాల్స్‌నుఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా పోలీసు అధికారి ఆధ్వర్యంలో యథావిధిగా కార్యక్రమాల నిర్వహణతోపాటు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు, ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్వాతంత్ర సమరయోధులు, ప్రజా ప్రతినిధులు, ఇతర అతి ధులకు సంబంధించి కూర్చోవడానికి ఏర్పాట్లకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే దేశభక్తి గీతాలతో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించేలాగా ఏర్పాట్లు చేయాలని డిఈఓకు కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ, విద్యుత్తు, మునిసిపల్, పోలీసు, సమాచార శాఖ, సంక్షేమ శాఖలు, విపత్తు అగ్నిమాపక శాఖ, వైద్య ఆరోగ్య, పౌర సరఫరా తదితర శాఖ అధికారులు సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, అడిషనల్ ఎస్.పి వి.భీమారావు, ఆర్డీవో కె .ప్రవీణ్ కుమార్ రెడ్డి, డిఈవో ఇ.నారాయణ, ఏ పి సి పి.శ్యాంసుందర్, డిపిఆర్ఓ టి.నాగేశ్వరరావు, డిపిఓ బి.అరుణశ్రీ, డిఎఓ జెడ్.వెంకటేశ్వరరావు, డ్వామా పిడి డా.కె.సిహెచ్ అప్పారావు, ఇరిగేషన్ అధికారి నాగార్జున రావు, జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్.వి.ప్రసాద్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ బివివి. నాగేశ్వరరావు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి.శ్రీనివాసరావు, డిఎం సివిల్ సప్లైస్ మేనేజరు టి.శివ రామప్రసాద్, డీఎస్ఓ ఎన్.సరోజ, డి ఎం అండ్ హెచ్ ఓ డా.భాను నాయక్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మురళీకృష్ణ, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతిరావు, జిల్లా చేనేత అధికారి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

విశాలాంధ్ర -రాజమహేంద్రవరం: శుక్రవారం రాజమహేంద్రవరం తిరుమల విద్యాసంస్థల ఆవరణలో 5వ తరగతి నుంచి 10 వరకు తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు జెఇఇ అడ్వాన్స్, జెఇఇ మెయిన్,నీట్‌లపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు సుమారు 14వేల మంది హాజరైనట్లు తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలియజేశారు. ఈ సందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో దేశవ్యాప్తంగా జరిగే ఇంజనీరింగ్ (జెఇఇ మెయిన్ అండ్ అడ్వాన్స్) పరీక్షల్లో 30 మంది పరీక్ష రాస్తే కేవలం ఒక్కరికి మాత్రమే సీటు దొరుకుతుందని అదే తిరుమలలో ప్రతి 4గురిలో ఒకరికి సీటు లభిస్తుందని, మెడికల్లో దేశవ్యాప్తంగా జరిగే నీట్ పరీక్షల ప్రకారం 24 మంది పరీక్ష రాస్తే కేవలం ఒకరికి మాత్రమే సీటు లభిస్తుందని అదే తిరుమలలో ప్రతి ముగ్గురిలో ఒకరికి మెడికల్ సీటు వస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ ఎక్కువసేపు ఆన్ లైన్ సోషల్ మీడియా చూస్తూ ఉంటూ మెదడును పనిచెయ్యకుండా చేయడమే 'బ్రెయిన్ రాట్' అంటారని దీని నుంచి బయటపడాలంటే పిల్లలను స్మార్ట్ ఫోన్, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌కు దూరంగా ఉంచుతూ, పెద్దల పట్ల గౌరవం, బాధ్యతతో మెలగడం ఎలాగో వారికి నేర్పాలని అన్నారు. ప్రస్తుతం ఎక్కువమంది పిల్లలు ఎలక్ట్రానిక్ గాడ్జెట్సకు బాగా అలవాటుపడి చదువుమీద శ్రద్ధ తగ్గిపోతుందన్నారు. తిరుమల విద్యాసంస్థల డైరెక్టర్ నున్న సరోజినీదేవి మాట్లాడుతూ పిల్లల ఎదుగుదలలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో ఉంటుందని ముఖ్యంగా పిల్లల ఎదుగుదల, మంచి నడవడిక, అభివృద్ధిలో తల్లిపాత్ర వెలకట్టలేనిదని, ప్రతి తల్లి తమ పిల్లలకు విలువలతో కూడిన విద్యను వారికి అందించే ప్రయత్నం చేయాలని తెలిపారు. 2024లో ఢిల్లీ ఎయిమ్స్‌లో సీటు సాధించిన పి.బేబి అభిజ్ఞు తండ్రి పి. సన్యాసిరావు, ఐఐటి హైదరాబాదులో సీటు సాధించిన సంతోషి గాయత్రి, వారణాసిలో సీటు సాధించిన మణికంఠ తల్లిదండ్రులు ఎం రాజశేఖర్, శ్రీను, పాల్గొని తిరుమల విద్యాసంస్థలో వారికున్న అనుభవాలను సదస్సుకు విచ్చేసిన తల్లిదండ్రులతో పంచుకున్నారు. ఈ సదస్సులో అకడమిక్ డైరెక్టర్ జి. సతీష్ బాబు, ప్రిన్సిపాల్ వి శ్రీహరి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, తిరుమల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలి : కమిషనర్

విశాలాంధ్ర – కాకినాడ : ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించి కాకినాడ నగరాన్ని పరిశుభ్రమైన నగరంగా ఉంచాలని కాకినాడ నగర పాలక సంస్థ కమిషనర్ భావన ఐఏఎస్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంపై కమిషనర్ భావన నగరపాలక సంస్థలోని అన్ని విభాగాల ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. వీధులు, డ్రెయిన్లు, పబ్లిక్ టాయిలెట్లను శుభ్రపరచడం, పార్కుల్లో తుప్పల తొలగింపు, ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రపరచడం వంటి కార్యక్రమాల షెడ్యూల్ ను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కెటి సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కే మనోహర్, సెక్రటరీ శ్రీకాంత్ రెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, టీపీఆర్ఓ శైలజ, మేనేజర్ సత్యనారాయణ, ఆర్ఓ శిరీష్ పాల్గొన్నారు.

పేదల కష్టాలు తీర్చడానికే ఎంఎంఆర్ ట్రస్టు

విశాలాంధ్ర – ప్రత్తిపాడు : నియోజకవర్గంలో పేదవారు పడుతున్న కష్టాలను తీర్చడానికే ఎంఎంఆర్ ట్రస్ట్ ప్రారంభించామని త్వరలోనే నియోజకవర్గంగా వ్యాప్తంగా ట్రస్ట్ సేవలు ప్రజలకు అందించడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. కాకినాడ ఆస్పత్రిలో ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న ధర్మవరం గ్రామానికి చెందిన వేమూలూరి రాంబాబు, పెద్దిపాలెం గ్రామానికి బంధం చిన్నారావు తదితరులను ఎంఎంఆర్ ట్రస్ట్ చైర్మన్, ప్రత్తిపాడు వైసీపీ నియోజవర్గ నాయకులు ముదునూరి మురళి రాజు పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ట్రస్ట్ తరఫున బంధం చిన్నారావుకు రూ.5000 ఆర్థిక సహాయం అందజేశారు. వేమూలూరి రాంబాబుకి కూడా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవ లక్ష్మణ్, కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, జువ్వల దొరబాబు, కోన బాబ్జి తదితరులు పాల్గొన్నారు.